క్లుప్తంగా

వృద్ధులు, అనాథలకు అన్నదానం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వృద్ధులకు, అనాథ చిన్నారులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. స్థానిక బస్టాండు ఆవరణలో రామిశెట్టి ఆదేశ్వరరావు, అందరి ఆనందం గ్రూపు నిర్వాహకుడు సోమేపల్లి వీరాంజనేయులు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానంతో పాటు చిన్నారులకు పెరుగన్నం పంపిణీ చేశారు. అనంతరం కూలీలు, కార్మికులు కూడా అన్నదానంలో అధికసంఖ్యలో, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని చింపివేయడంపై మంగళవారం గ్రామ సర్పంచ్ పెరికల కృష్ణమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పచ్చల తాడిపర్రు బస్ షెల్టర్ వద్ద పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అభిమానులు భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మంగళవారం ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ సంఘటన గ్రామంలో వివాదానికి దారి తీసింది. జరిగిన సంఘటనపై గ్రామ సర్పంచ్ పెరికల కృష్ణమోహన్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ భార్గవ్‌కు ఫిర్యాదుచేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నగదు గోల్‌మాల్ ఘటనలో ఇద్దరి అరెస్ట్

పట్నంబజారు: సెల్‌ఫోన్ షాపులో నగదు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సంగీత మొబైల్‌షాపులో గత కొద్దిరోజుల క్రితం అకౌంట్ విభాగం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈనేపథ్యంలో రూ. 4 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు కనబడకపోవడంతోపాటు, నగదును మేనేజర్ అఫ్సర్‌బాషా, క్యాషియర్ ఫిరోజ్ దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈమేరకు సంగీత మొబైల్ షోరూమ్స్ జిల్లా ఇన్‌చార్జి రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

మద్యం మత్తులో ఆటోడ్రైవర్ హల్‌చల్

పట్నంబజారు: పూటుగా మద్యం సేవించి ఆటోడ్రైవర్ హల్‌చల్ చేసిన సంఘటనపై కేసు నమోదైంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములూరుపాడుకు చెందిన సయ్యద్ సాధిక్ తన ఆటోలో గుంటూరు మంగళవారం బాడుగ నిమిత్తం వచ్చాడు. శారదా కాలనీలో పూటుగా మద్యం సేవించి ఇష్టానుసారంగా ఆటో నడుపుతూ కొత్తపేట శివాలయం వద్ద ఇరువురు మహిళలను ఢీకొట్టాడు. ప్రమాదంలో మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో భయానక వాతావరణం నెలకొంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఆటపాటలతో చిన్నారుల్లో చురుకుదనం



నెహ్రూనగర్: వ్యాయామాలు, ఇతర యాక్టివిటీస్ ద్వారా చిన్నారులు చురుగ్గా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ తబిత తెలియజేశారు. గుంటూరు అర్బన్ ఈస్ట్ 1 సెక్టార్ మణిపురం, ఇశ్రాయేల్‌పేటలోని అంగ్‌వాడీ కేంద్రంలో జన్‌బాగీదారీ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, తల్లిదండ్రులకు పోషణ, నైపుణ్యతపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కువగా వివిధ యాక్టివిటీస్ వైపు మొగ్గ చూపే లా చూడాలన్నారు. తద్వారా వారు చురుగ్గా ఉంటారన్నారు. అదేవిధంగా జన్‌భాగిధరి కార్యక్రమంలో భాగంగా ఈస్ట్ 2 సెక్టార్ పరిధిలోని తిమ్మయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నీలిమ తల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం పెట్టడం ద్వారా పుష్టిగా ఉంటారన్నారు.

ప్రత్యక్ష నరకం.. పార్శ్వపు నొప్పి తీవ్రం

యువతను వేధిస్తున్న మైగ్రేన్

- విపరీత ఆలోచనలు, నిద్రలేమి, 'స్మార్ట్' బానిసత్వమే కారణాలు
- ముందస్తు జాగ్రత్తలతో మైగ్రేన్ తలనొప్పిని కట్టడి చేయవచ్చు
- జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం
- జూన్ నెల మైగ్రేన్ అవగాహన మాసం

గుంటూరు మెడికల్: మైగ్రేన్ .... సోకిందంటే ఓ పట్టాన వదిలిపోదు. యుక్తవయస్సులోనే అనేక మంది మైగ్రేన్ బారిన పడుతున్నారు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు చిన్న వయస్సులోనే ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం తీవ్రమైన తలనొప్పి సమస్యతో బాధపడుతున్నారు. తలనొప్పితో ఏ పనిచేయలేక తమ రోజువారీ పనులు సైతం చేసుకోలేక పలువురు అల్లాడిపోతున్నారు. జూన్ నెల నేషనల్ మైగ్రేన్ అండ్ హెడ్‌ఏక్ అవగాహన మాసం సందర్భంగా తలనొప్పి, మైగ్రేన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

➡ యువతలోనే అధికశాతం...

ఆధునిక జీవనశైలిలో యువతే ఎక్కువగా మైగ్రేన్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఎక్కువగా 20 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు మైగ్రేన్ బారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారు అధికంగా మానసిక ఒత్తిడికి గురవుతూ మైగ్రేన్ బారిన పడుతున్నారు. ఉద్యోగాలు, చదువులో పోటీ తత్వం ఏర్పడి ర్యాంకులు సాధించేందుకు ఒత్తిడికి గురవ్వటం వల్ల తలనొప్పి వస్తుంది. నిద్రలేమి, విచ్చలవిడిగా కంప్యూటర్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు వినియోగిస్తూ కంటికి సరిపడా నిద్రపోకుండా ఉండటం వల్ల మైగ్రేన్ బారిన పడుతున్నారు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన సునీత కొద్దిరోజులుగా తలనొప్పి వల్ల కాలేజీకు వెళ్లలేక ఇంట్లోనే ఉంటోంది. తల్లిదండ్రులు ఆమెను వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా మైగ్రేన్ తొలనొప్పితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. విద్యార్థిని స్మార్ట్‌ఫోన్‌లో అర్ధరాత్రిళ్లు వరకు ఆన్‌లైన్ చాటింగ్‌లు చేస్తూ నిద్ర సక్రమంగా పోకుండా ఉండటం వల్ల ఈ వ్యాధికి గురైనట్లు నిర్ధారణ చేశారు.



➡ బాధితుల వివరాలు...

జిల్లాలో 60 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉండగా ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో వారంలో మూడురోజులపాటు న్యూరాలజీ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నారు. ఒక్కోరోజు 300లకు పైగా బాధితులు చికిత్స కోసం వస్తుండగా, వారి లో పది మంది వరకు మైగ్రేన్ బాధితులు ఉంటున్నారు.

నల్లపాడుకు చెందిన విజయలక్ష్మి అనే గృహిణి ఇంట్లో పనులు ఏమీ చేయకుండా తలనొప్పి వల్ల మంచానికే పరిమిత మవుతూ ఉండటంతో కుటుంబ సభ్యులు వైద్యుల వద్దకు తీసుకెళ్లగా మైగ్రేన్ తలనొప్పి అని నిర్ధారణ చేశారు. వ్యసనాలకు బానిసైన భర్త ఇంట్లో పట్టించుకోకుండా ఇష్టా నుసారంగా ప్రవర్తిస్తూ ఉండటంతో ఆమె లో విపరీతమైన ఆలోచనలు పెరిగిపోయి మైగ్రేన్ తలనొప్పి వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

➡ కారణాలు...

మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి(పార్శ్వపు నొప్పి) చాలా వరకు తలకు ఒక పక్క మాత్రమే వస్తుంది. తలలో రక్తనాళాలు ఒత్తిడికి గురై వాయటం వల్ల వస్తుంది. కొన్ని సార్లు తలలో రెండు వైపులా ఈ నొప్పి వస్తుంది. తలలో కొట్టుకుంటున్నట్లుగా, నొప్పి వస్తూ పోతూ ఉన్నట్లుగా, తగ్గుతూ ... తీవ్ర మవుతూ ఉన్నట్లుగా మైగ్రేన్ ఉంటుంది. కొందరికి వాంతులు అవుతాయి. మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవ్వటం, అనవసరపు ఆలోచనలు, జరిగిపోయిన విషయాలను తరచుగా ఆలోచించటం వల్ల తలనొప్పి వస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగినా, ప్రయాణాలు ఎక్కువ చేసినా, భోజనం చేయటం ఆలస్యమైనా, అసలు భోజనం చేయకపోయినా, నిద్ర తక్కువైనా, ఎక్కువైనా తలనొప్పి రావొచ్చు. స్త్రీలలో హార్మోన్ల సమస్యలు ఏర్పడినప్పుడు, రుతుక్రమం ముందుగాని, తర్వాత గాని వచ్చే అవకాశం ఉంది.

➡ లక్షణాలు...

పార్శ్వపు నొప్పి వచ్చిన మొదటి దశలో చిరాకు, మానసిక ఆందోళన, డిప్రెషన్, ఆలోచనల్లో మార్పు రావటం, వాసన, వెలుతురు పడకపోవటం, మెడ నొప్పి ఉంటాయి. రెండో దశలో చూపు మందగించటం, జిగ్‌జాగ్‌లైన్స్ కనిపించటం, తలలో సూదులు గుచ్చిన భావన కలుగుతుంది. మాటలు తడబడటం, కాళ్లల్లో నీరసం ఉంటాయి. మూడోదశలో తలనొప్పి రెండు గంటల నుంచి మూడు రోజుల పాటు ఉండొచ్చు. వాంతులు ఉంటాయి. నొప్పి ఒక వైపు ఉంటుంది. కాంతిని చూసినా, శబ్దాలు విన్నా చికాకు పుడు తుంది. నాల్గోదశలో తలనొప్పి తగ్గిన తర్వాత కొద్ది రోజుల వరకు తల భారంగా అనిపిస్తుంది. ఒళ్లంతా నీరసంగా, నిరాసక్తంగా అనిపిస్తుంది.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం..



గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం, గురువారం, శనివారం మైగ్రేన్ బాధితులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందిస్తున్నాం. వివిధ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. మైగ్రేన్‌ను నియంత్రణలో పెట్టడం ద్వారా కొన్నాళ్లకు అదే తగ్గిపోతుంది. కాని మరలా కొంత కాలం తర్వాత తిరిగి రావచ్చు. నెలకు రెండుసార్లు కంటే ఎక్కువగా తలనొప్పి వస్తున్నా, ఒక్కసారే వచ్చి ఎక్కువసేపు నొప్పి ఉంటున్నా ప్రత్యేక మందులు తీసుకోవాలి.

– డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, న్యూరాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత బీజేపీ నేతలకు లేదు

రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరి సతీష్‌శర్మ

గుంటూరు రూరల్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన తప్పుడు ఆరోపణలను నమ్మే పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు లేరని, ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత బీజేపీ నేతలకు లేదని ఏపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరి సతీష్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్డులోని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విభజన హామీలను తుంగలోతొక్కి బీజేపీ నాయకులు నీతులు వల్లిస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే బీజేపీ ప్రైవేటీకరణకు సిద్ధమయిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇస్తున్న స్థాయిలో రాష్ట్రానికి నిధులు మంజూరు చేయడం లేదన్నారు. కర్ణాటకలో ప్రజా సమస్యలను తీర్చకపోవడం వలన, కులాలు, మతాల మధ్య చిచ్చు రాజేయడం వల్ల ప్రజలు బీజేపీని చిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ కూడా అధికారంలో వున్నప్పుడు ఇలాగే వ్యవహరించారని అధికారం పోగానే నేడు కనపడకుండా పోయారనే వాస్తవాలను బీజేపీ పెద్దలు గుర్తుంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కోట్లాది మంది ప్రజలకు నేరుగా వారి ఖాతాలలో డబ్బు జమచేయడం అవినీతి ఎలా అవుతుందని ప్రశ్నించారు. నిరుపేదలు లక్షాధికారులు కావాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అయితే, కార్పొరేట్లకు రూ.లక్షలకోట్లు దోచిపెట్టడమే టీడీపీ, బీజేపీల లక్ష్యమని కోనూరు సతీష్ శర్మ ఎద్దేవా చేశారు.

మెకానిక్‌ల సమస్యకు త్వరలో పరిష్కారం

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో ఆటోనగర్ లేకపోవడంతో జీబీసీ రోడ్డుపక్క, రోడ్లపై మెకానిక్ పనులు చేసుకుంటూ మెకానిక్ సోదరులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారి సమస్యలను త్వరలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరిష్కరించనున్నట్లు పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు తెలిపారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సూచనల మేరకు పార్టీ నాయకులు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల బొద్దులూరి రంగారావు, యందేటి వెంకటసుబ్బయ్య, మల్లెల రాజు, ఎం.అనీల కుమారి, కొల్లూరు శ్రీనివాసరావు తదితరులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతూ అడ్డుపడుతూ ఆటంకాలు కలిగిస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం స్థానిక భావన్నారాయణస్వామి దేవస్థానం భూములను లీజు ప్రాతిపదికపై తీసుకొని మెకానిక్‌లకు ఆటోనగర్ నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆటోనగర్ నిర్మాణం చేయలేకపోయారన్నారు. బీజేపీ నాయకులను అడ్డుపెట్టుకొని వారితో రెచ్చగొట్టే ప్రకటనలు చేయించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవటం కోసం తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు. నాయకులు అమిరినేని సాంబశివరావు, నూరుభాషా అల్లాబక్షి, గేరా కుమారి, గోగినేని రామకృష్ణ, మోపర్తి ప్రమీల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల

అభివృద్ధి పనులకు పెద్దపీట

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ చెప్పారు. ఈమేరకు రూ. 20 లక్షల నిధులతో ప్రారంభించనున్న కల్వర్టులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మహిళ నేత నూరిఫాతిమా, కార్పొరేటర్ ఐశెట్టి కనకదుర్గ మాట్లాడుతూ నగరంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో కూడా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అయిశెట్టి శ్రీనివాస్, శృంగారపు శ్రీనివాసరావు, రామకృష్ణ, ఉమపాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు..

నగరంలో నాజ్‌సెంటర్‌లో వెంచేసియున్న శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు ఆలయ చైర్మన్, కమిటీ మెంబర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచిత మెడికల్ క్యాంపును వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళనేత షేక్ నూరిఫాతిమా ప్రారంభించారు. చైర్మన్ జేపీఎస్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కనకదుర్గ, నూరిఫాతిమా

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు

విద్యాకానుక కిట్ల పంపిణీలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు

పట్నంబజారు: విద్యా వ్యవస్థను పటిష్టం చేసి.. విద్యార్థుల భవిష్యత్తుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారు బాట వేస్తున్నారని నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు చెప్పారు. వసంతరాయపురంలోని లూర్దు హైస్కూల్‌లో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా, విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలను సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. చిన్నారుల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకునివచ్చారని, చదువుకు ఇబ్బందులు కలగకూడదని యోచించే గొప్ప మనస్సున్న వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం జగన్ విద్యకు తొలి ప్రాధాన్యతిచ్చి, విద్యార్థులకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తయారు చేశారన్నారు. కార్పొరేటర్‌లు దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, ఫాదర్ రాయప్ప, హెచ్ఎం బాలశౌరి, వైఎస్సార్ సీపీ నేతలు జేపీఎస్ రెడ్డి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



కిట్‌లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు తదితరులు

ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో విద్యాభివృద్ధికి బాటలు వేశారని కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టీ పేర్కొన్నారు. మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. 15వ డివిజన్ కార్పొరేటర్ అజయ్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, గరల్స్ హైస్కూల్ హెచ్ఎం బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణపై అవగాహన

మంగళగిరి: ప్రభుత్వ స్థలాలలో స్థిర నివాసం ఏర్పరచుకుని నివాసముంటున్న వారి స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మహత్తర అవకాశం కల్పించిందని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్థలాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ కార్యదర్శులు, వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వంద గజాలలోపు స్థలాలకు ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరించి డి పట్టా అందజేస్తుందని చెప్పారు. 100 గజాల నుంచి 500 గజాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం నుంచి స్థలాలు, గృహాలు పొందిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని చెప్పారు. క్రమబద్ధీకరణకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు నియమ నిబంధలను వివరించాలన్నారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకుల అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద సింగిల్‌నంబరు లాటరీ ఆడిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6,810లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ప్రజాసంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- మంగళగిరిపాడు సచివాలయ భవనం ప్రారంభం



మేడికొండూరు: ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తెలిపారు. మండల పరిధిలోని మంగళగిరిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి దేశంలోనే ప్రత్యేక గుర్తుంపు తెచ్చినట్లు చెప్పారు. తద్వారా అన్ని సేవలు ఇంటి వద్దేకు అందుతున్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వాలు చేయని పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందాలనే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం వదిలేసి, అధికార దాహంతో ప్రతిపక్షాలు చేప్పే మాటలు నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. తొలుత సర్పంచి షేక్ రబ్బానిఆధ్వర్యంలో అతిథులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, వైస్ ఎంపీపీలు భవనం రాజశేఖరరెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, డోకిపర్రు సర్పంచి కొండెపోగు సాంబ్రాజ్యం,కొర్రపాడు సర్పంచి నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి మురళి, వాడపర్తి భారతి, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, మైనారిటీ సెల్ నాయకులు షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

బంగారు భవితకు విద్యాకానుక దోహదం



కుర్నూతలలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న సర్పంచ్ గోపాలకృష్ణయాదవ్



అనంతవరప్పాడులో విద్యాకానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

వట్టిచెరుకూరు జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి

ప్రత్తిపాడు: విద్యార్థుల బంగారు భవితకు జగనన్న విద్యాకానుక దోహదపడుతుందని వట్టిచెరుకూరు జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జేవీకే కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటలక్ష్మి విద్యార్థులతో మాట్లాడారు. జేవీకే కిట్లు అందజేశారు. అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు థాంక్యూ సీఎం సార్.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

కుర్నూతల గ్రామంలో..

మండల పరిధిలోని కుర్నూతల గ్రామ పంచాయతీలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపికృష్ణ యాదవ్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్కూల్ బ్యాగులు, షూలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన ఉపకరణాల కిట్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన ఉపకరణాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు కిట్లు అందజేసిన అనంతరం సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు తల్లి మొదటి గురువు అని, ప్రభుత్వం ఉచితంగా అందజేసిన బోధన ఉపకారణాల ద్వారా విద్యను బోధించాలని సూచించారు. జాతీయ మేధో సాధికార సంస్థ ప్రతినిధులు రామాంజనేయులు, ఎం.మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ పిల్లల్లో వయసులా వారీగా మూడు రకాల కిట్లు అందజేశామని, ఈ విధంగా గుంటూరు జిల్లా పరిధిలో ఒక్కోటి రూ.10వేల విలువ కలిగిన 90 కిట్లను ఆయా మండలాల వారీగా పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి ఈ విధంగా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు కిట్లు అందజేస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి

విద్యారంగంలో దేశంలోనే ఏపీ అగ్రగామి

- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్
- సీఎం జగన్ చిత్రపటానికి విద్యార్థుల క్షీరాభిషేకం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కని బాటలు వేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ తెలిపారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక అందజేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి విద్యార్థినులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, మన రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా విద్యాకాంతులు విరజిమ్ముతున్నట్లు చెప్పారు. విద్య ద్వారానే పేద కుటుంబాలు ఉన్నత స్థితికి ఎదిగే అవకాశాలు ఉన్నాయన్న వాస్తవాన్ని తొలిసారిగా గుర్తించిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 43,10,165 మంది విద్యార్థులకు రూ. 1,042.53 కోట్ల ఖర్చుతో జగనన్న కిట్లను పంపిణీ చేయడం జరిగిందని, తద్వారా ఇప్పటివరకు జగనన్న విద్యాకానుకపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం రూ.3,366.53 కోట్లని చెప్పారు. కేవలం ఒక్క విద్యారంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలపైనే జగనన్న ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేసిన మొత్తం వ్యయం రూ.60,329.42 కోట్లకు చేరినట్లు వివరించారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్ఎం బి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ క్లాస్‌రూమ్, డిజిటల్ బోర్డ్ అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం రామకృష్ణ మిషన్ స్కూల్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలకు స్మార్ట్‌క్లాస్ రూమ్‌ను బహూకరించారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌నురోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పేద, మధ్య తరగతి ప్రజల విద్యార్థులు చదువుతున్న రామకృష్ణ మిషన్ స్కూల్లో చదువుకోవడానికి వీలుగా ఓ డిజిటల్ బోర్డును ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ రోజురోజుకి పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ క్లాస్‌రూమ్ బహూకరించినట్లు చెప్పారు. అదే విధంగా ఓ డిజిటల్ బోర్డును కూడా అందజేయడం జరిగిందని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ డేర్ ప్రాజెక్ట్ చైర్మన్ త్రిపురనేని మురళి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వారు సంప్రదించగా తమ క్లబ్ తరుపున వెంటనే డేర్ ప్రాజెక్ట్ కింద అప్రూవల్ తీసుకుని 15 రోజుల్లో ప్రాజెక్ట్ చేయడం జరిగిందని అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి కోశాధికారి శెట్టి రామకృష్ణ, సభ్యులు కిరణ్ పాల్గొన్నారు.